# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

● చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బాల్క సుమన్


రామకృష్ణాపూర్ : పులిమడుగు మాజీ సర్పంచ్ భూక్యా రాజుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విప్ బాల్క సుమన్

చెన్నూర్, నవంబర్ 13: చెన్నూర్ పట్టణంలో తాను చేసిన అభివృద్ధిని చూసి తనను ఆశీర్వదించాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ అన్నారు. చెన్నూర్ పట్టణంలోని 1,2వ వార్డులోని కోటబొగుడ, జెండావాడలో ఆదివారం రాత్రి గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నూర్ పట్టణంలో 60 ఏండ్లలో జరగని అభివృద్ధిని తాను చేశానని తెలిపారు. దాదాపు వంద కోట్ల రూపాయలతో తాను చేపట్టిన పలు అభివృద్ధి పనులు మీ కండ్ల ముందే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. పట్టణంలోని జలాల్ పెట్రోల్ పంపు నుంచి అంబేద్కర్ చౌక్ వరకు ప్రధాన రహదారిని విస్తరించి, డివైడర్, సెంట్రల్ లైటింగ్, పలు కూడళ్లు, ఫౌంటేయిన్‌తో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పెద్ద చెరువు, కుమ్మరి కుంట మినీ ట్యాంకు బండ్లతో పాటు కేసీఆర్ పార్కును నిర్మించినట్లు తెలిపారు. రూ 10 కోట్లతో పట్టణ నడిబొడ్డున 50పడకల దవాఖానను నిర్మించినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు, కూరగాయల వ్యాపారులు, రైతుల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. మహిళా భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. రూ.40 కోట్లతో వంద పడకల దవాఖాన కోసం నూతన భవనాలను, రూ 4 కోట్లతో బస్ డిపోను నిర్మిస్తున్నామని పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ పనులన్నీ మీ కండ్ల ముందే ఉన్నాయని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ వార్డుకు వచ్చిన బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌ను పెద్ద ఎత్తున మహిళలు తరలి వచ్చి మంగళ హారతులతో స్వాగతం పలికారు. వార్డుకు చెందిన 300మంది యువకులు కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాల్క సుమన్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో బాల్క సుమన్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని వార్డు ప్రజలు ముక్తకంఠంతో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కమ్మల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తుల సమ్మయ్య, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**జోరుగా బీఆర్ఎస్ ప్రచారం**

కోటపల్లి, నవంబర్ 13 : కోటపల్లి మండలంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతున్నది. మండలంలోని జనగామ గ్రామంలో ఎంపీటీసీ మారిశెట్టి తిరుపతి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన బాల్క సుమన్ కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ పంచారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కొడిశెట్టి సంతోష్, యూత్ అధ్యక్షుడు సల్వాల కిరణ్, అల్లాడి తిరుపతి నాయకులు, కార్యకర్తలున్నారు.

**చెన్నూర్‌లో..**


బీఆర్ఎస్‌లో చేరిన వారితో విప్ బాల్క సుమన్

చెన్నూర్ రూరల్, నవంబర్ 13: మండలంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతున్నది. జడ్పీటీసీ మోతె తిరుపతి, ఎంపీపీ మంత్రి బాపు, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నాగాపూర్, కొమ్మెర, పొక్కూర్, బీరెల్లి, సోమన్‌పల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వివరిస్తూ ప్రచారం చేశారు. 40 ఏండ్లు పరిపాలించిన కాంగ్రెస్ ప్రభుత్వంలో గాని, ఎమ్మెల్యేగా పనిచేసిన నల్లాల ఓదెలుతో కాని చెన్నూర్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదని పేర్కొన్నారు. బాల్క సుమన్ వచ్చిన తర్వాత చెన్నూర్ నియోజక వర్గ అభివృద్ధే ధ్యేయంగా శ్రమించాడని కొనియాడారు. చెన్నూర్ నియోజకవర్గానికి రూ.2 వేల కోట్ల నిధులు తీసుకువచ్చి ఎంతో అభివృద్ధి చేశాడని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎక్కడిక్కడ అభివృద్ధి ఆగిపోతుందని, రైతులు, వ్యాపారులు, ప్రతి ఒక్కరికీ మళ్లీ కష్టాలు ప్రారంభమవుతాయని యువకులు, రైతులకు వివరించారు. బాల్క సుమన్ మళ్లీ ఎమ్మెల్యేగా గెలిస్తే మండలంతో పాటు నియోజక వర్గం ఎంతగానో అభివృద్ధి చెందుతుందని గ్రామస్తులకు వివరించారు. ఇటీవలే కేసీఆర్ నూతన మండలంగా ఆస్నాద్ గ్రామాన్ని ప్రకటించారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మండలం ప్రతిపాదన ఆగిపోతుందని మండల ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుక్కడపు నరేందర్, అన్నల మానస, తిరుపతి, మాజీ సర్పంచ్ బండారి సత్యనారాయణ, నాయకులు వడ్లకొండ రవి. ఆకుదారి సమ్మయ్య (బన్ని), తాళ్లపెల్లి కిరణ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

**పులిమడుగు ఎంపీటీసీ బీఆర్ఎస్‌లో చేరిక**

రామకృష్ణాపూర్, పులిమడుగు గ్రామ మాజీ సర్పంచ్ భూక్యా రాజు, ప్రస్తుత ఎంపీటీసీ ధరావత్ తిరుపతి, మాజీ ఎంపిటీసీ తేజ ,రవినాయక్‌తో పాటు మరి కొందరు ఆదివారం దీపావళి పండుగ రోజున ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి విప్ బాల్క సుమన్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో, పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతకాని, మందమర్రి మండల జడ్పీటీసీ వేల్పుల రవి, అందుగులపేట సర్పంచ్ తిరుపతిరెడ్డి, మండల రైతు బంధు సమితి కో-ఆర్డినేటర్ బలికొండ కిషన్, కార్యకర్తలు పాల్గొన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ 9వ వార్డు, తిమ్మాపూర్‌కు చెందిన సుమారు వంద మంది యువకులు చెన్నూరు బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో తన స్వగృహంలో పార్టీలో చేరారు. వారందరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పారిపెల్లి తిరుపతి, తదితరులున్నారు.

**క్యాతనపల్లి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడిగా సుదర్శన్‌గౌడ్**

రామకృష్ణాపూర్, నవంబర్ 13: చెన్నూర్ నియోజకవర్గం క్యాతనపల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు, ప్రస్తుత మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యులు, మాజీ జడ్పీటీసీ కంభగోని సుదర్శన్ గౌడ్‌ను నియమించినట్లు మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. ఆయనతో పాటు మున్సిపాలిటీ యువజన విభాగం అధ్యక్షుడిగా దాసరి రాకేశ్ నియమించారు. వీరికి ఎమ్మెల్యే బాల్క సుమన్ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా నియమించినందుకు ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు సుదర్శన్‌గౌడ్, యువజన ప్రెసిడెంట్ రాకేశ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. రాజా రమేశ్, గాండ్ల సమ్మయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ విద్యాసాగర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ, కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ యాకూబ్‌అలీ, కౌన్సిలర్లు జాడి శ్రీనివాస్, పారిపెల్లి తిరుపతి, అనిల్‌రావు, పొలం సత్యం, అలుగుల శ్రీలత, మహేశ్, యువత నాయకుడు గాజుల చంద్రకిరణ్, గోనె రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


సుదర్శన్‌గౌడ్‌ను అభినందిస్తున్న విప్ బాల్క సుమన్


కోటపల్లి : జనగామలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


చెన్నూర్ రూరల్ : నాగాపూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

## దీపావళి వేడుకల్లో పాల్గొన్న విప్ బాల్క సుమన్


వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్

చెన్నూర్ టౌన్, నవంబర్ 13 : చెన్నూర్ పట్టణంలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దుకాణాదారులు, ఇండ్లల్లో లక్ష్మీపూజలు నిర్వహించి, పటాకులు కాల్చారు. సోమవారం కేదారేశ్వర వ్రతాలు నోముకున్నారు. చెన్నూర్ పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ అర్చనా గిల్డా ఇంట్లో నిర్వహించిన దీపావళి వేడుకల్లో ప్రభుత్వ విప్, చెన్నూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ పాల్గొన్నారు. అర్చనా రాంలాల్ గిల్డా దంపతులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి పటాకులను కాల్చారు. పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రేవెల్లి మహేశ్, బీఆర్ఎస్ నాయకులు సాధనబోయిన కృష్ణ, పెండ్యాల లక్ష్మణ్, మహేందర్, కొప్పుల రవీందర్, ఎండీ షరీఫ్, షఫీ, నాయని సతీశ్ కుమార్, వినయ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, కార్యకర్తలున్నారు.

**కోటపల్లిలో..**

కోటపల్లి, నవంబర్ 13 : కోటపల్లి మండలంలో దీపావళి సందర్భంగా ఇంటి ముందు దీపాలు వెలిగించి, పటాకులు కాల్చారు. ఇండ్లలో లక్ష్మీపూజ, కేదారీశ్వర వ్రతాలు నిర్వహించారు.

**చెన్నూర్ మండలంలో..**

చెన్నూర్ రూరల్, నవంబర్ 13: మండలంలో కొమ్మెర, పొక్కూర్, ఎర్రగుంటపల్లి, ఆస్నాద్, నాగాపూర్, ఒత్కుల పల్లి, కిష్టంపేట, అక్కెపల్లి, కత్తరశాల, బావురావుపేట, ముత్తరావుపల్లి, అక్కెపల్లి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో బోగి పండుగ, దీపావళి పండుగ నిర్వహించారు. ఉదయాన్నే సమీప గోదావరిలో ప్రజలు పుణ్యస్నానాలు చేశారు. అనంతరం సమీప ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం లక్ష్మీ పూజలు. శ్రీ కేదారీశ్వర స్వామి నోములు నిర్వహించారు. పటాకులు కాల్చి సంబురాలు నిర్వహించారు.

## పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి

● మంచిర్యాల జిల్లా ఎలక్షన్ అబ్జర్వర్ బిశ్వజిత్ దత్త


తహసీల్దార్‌కు సూచనలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్ బిశ్వజిత్ దత్త

లక్షెట్టిపేట, నవంబర్ 13: పట్టణంతో పాటు మండలంలో ఉన్నటువంటి అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అబ్జర్వర్ బిశ్వజిత్ దత్త అధికారులను ఆదేశించారు. సోమవారం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో లక్షెట్టిపేట పట్టణంతో పాటు మండలంలో ఉన్న 47 పోలింగ్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరా ఉండాలని అదే విధంగా ప్రతి కేంద్రం వద్ద ర్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు. ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని ముందుగా ఏర్పాట్లు పూర్తి చేసి ఎన్నికలకు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ రాఘవేంద్రరావు ఉన్నారు.

## ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన

కోటపల్లి, నవంబర్ 13 : కోటపల్లి మండలంలోని నక్కలపల్లి గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కోటపల్లి శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంక్‌ల ద్వారా అందిస్తున్న సేవలు, రుణాలు, బీమా పథకాలను బ్యాంక్ మేనేజర్ ఉదయ్ కుమార్ వివరించారు. బ్యాంక్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించాలని సూచించారు. బ్యాంక్ పథకాలు, ఆన్‌లైన్ మోసాలు తదితర విషయాలపై కళాజాత ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోట స్రవంతి ఖాతాదారులు పాల్గొన్నారు.